## బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలు!

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఈ నెల 6, 7, 11 తేదీల్లో అల్పపీడనాలు ఏర్పడనున్నాయి. వీటి ప్రభావంతో తెలంగాణ, ఏపీ, తమిళనాడులో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నది. తెలంగాణ, ఏపీల్లో ఈ నెలలో సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదుకావొచ్చని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## మైనార్టీల అభ్యున్నతికి కృషి చైర్మన్ ఒబెదుల్లా

హైదరాబాద్, నవంబర్ 4(నమస్తే తెలంగాణ): మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా తెలిపారు. బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి రూ.3 వేల కోట్లు, అందులో మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.432 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని గుర్తుచేశారు. సోమవారం నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఒబెదుల్లా మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల యూనిఫాం ఆర్డర్లను మైనార్టీ మహిళలకు ఇవ్వనున్నట్టు వెల్లడించారు.

# సెక్రటేరియట్‌కు రాని సీఎం

మొదటిపేజీ తరువాయి...

వెళ్లాల్సిందే. అభినందనలు, సన్మానాలు, సత్కారాలు అన్నింటికీ సీఎం నివాసమే వేదికగా మారింది. అక్టోబర్ 26న రేవంత్ అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. ఆ తర్వాత ఇప్పటివరకు సచివాలయం వైపు రేవంత్‌రెడ్డి కన్నెత్తి చూడలేదు. 'ఆఫీసుకు సెలవు' పెట్టారంటూ సచివాలయంలో జోకులు వేసుకుంటున్నారు.

తన నివాసం నుంచి సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

### సమీక్షలన్నీ అక్కడే

రెండు నెలలుగా సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి నుంచే పాలన సాగిస్తున్నారు. ఆదివారం బీసీ కులగణనపై సమీక్ష కూడా ఇంటి వద్దే నిర్వహించారు. డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేస్తూ ఇంట్లోనే నిర్ణయం తీసుకున్నారు. అక్టోబర్ 25న స్పోర్ట్స్ పాలసీపై సమీక్ష నిర్వహించారు. నవంబర్ నెలాఖరులోపు డ్రాఫ్ట్ రెడీ చేయాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 24న మూసీ రివర్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రో విస్తరణపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని ఆ సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 4న విద్యుత్ శాఖపై, 23న ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డులపై సమీక్ష నిర్వహించారు. దీనికి డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క, హాజరయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఇతర నేతలను ఇంటికే పిలిపించుకొని చర్చలు జరుపుతున్నారు.

### కలవాలంటే.. చలో జూబ్లీహిల్స్

ఎవరైనా సీఎంను కలవాలంటే జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లాల్సిందే అన్నట్టుగా తయారైంది పరిస్థితి. అధికారిక హోదాల్లో కొత్తగా నియమితులైనవారు కూడా సీఎంను ఆయన ఇంటికి వెళ్లే కలుస్తున్నారు. ఇటీవల నియమితులైన వీసీలు, ఉన్నత విద్యామండలి చైర్మన్ శనివారం జూబ్లీహిల్స్‌కు వెళ్లి సీఎంను కలిశారు. వికారాబాద్‌లో నేవీ రాడార్ స్టేషన్ పనుల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా సీఎంను ఆహ్వానించేందుకు ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్ బీఆర్ సింగ్ అక్టోబర్ 10న సీఎం ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. సెప్టెంబర్ 11న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా జూబ్లీహిల్స్‌లోని రేవంత్ ఇంటికి వెళ్లి భేటీ అయ్యారు. సెప్టెంబర్ 7న నూతన నియమితులైన బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు వెళ్లి కలిశారు.

### ఎవరైనా సరే.. ఇంట్లోనే కలవాలి

సెప్టెంబర్‌లో యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ కూడా సీఎంను ఆయన ఇంట్లోనే కలిశారు. అధికారులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతల ప్రదక్షిణలకు లెక్కే లేదు. భారీ వర్షాలకు నష్టపోయిన ఖమ్మం జిల్లాను ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళాలు అందాయి. సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు సీఎం నివాసానికి వెళ్లి చెక్కులు అందజేశారు. సీఎం సచివాలయానికి రాకుండా ఇంటికే పరిమితం అవుతున్నారని రాజకీయ వర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్టోబర్‌లో సీఎం సచివాలయానికి చాలాసార్లు డుమ్మా కొట్టారని, ఇప్పటికైనా క్రమం తప్పకుండా ఆఫీసుకు రావాలని సూచిస్తున్నారు.

### ఇంట్లో సీఎం.. సెలవులో సీఎస్

సీఎస్ శాంతికుమారి వ్యక్తిగత సెలవులపై వెళ్లినట్టు తెలుస్తున్నది. దాదాపు వారం రోజులు అందుబాటులో ఉండరని సచివాలయ వర్గాలు తెలిపాయి. సీఎస్ సెలవులో ఉన్నప్పుడు బాధ్యతలు మరో సీనియర్ అధికారికి అప్పగిస్తుంటారని, ఈసారి బాధ్యతలు ఎవరికీ ఇవ్వలేదని సమాచారం. సీఎస్ ఇటీవల సీఎంతో పాటు అమెరికాలో పర్యటించిన సమయంలోనూ బాధ్యతలను ఎవరికీ అప్పగించలేదు.

## ప్రేమించలేదని యువతిపై కత్తితో దాడి

- చేతికి తీవ్రగాయాలు.. గాంధీ దవాఖానకు తరలింపు
- మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఘటన

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 4: తన ప్రేమను అంగీకరించలేదన్న కక్షతో ఓ యువకుడు యువతిపై కత్తితో దాడిచేసిన ఘటన మెదక్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకున్నది. మెదక్ పట్టణ పరిధిలోని అవుసులపల్లికి చెందిన యువతి మెదక్ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డిగ్రీ పరీక్ష రాస్తున్నది. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ఉండగా ఉదయం 8.30 గంటలకే కళాశాల వద్దకు చేరుకున్నది. అప్పటికే అక్కడికి చేరుకున్న హైదరాబాద్‌కు చెందిన చైతన్య ఆమె చేతిలో నుంచి సెల్‌ఫోన్ లాక్కొని పగులకొట్టాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె కుడి చేతిని తీవ్రంగా గాయపరిచి పారిపోయాడు. పోలీసులు ఆ యువతికి ప్రాథమిక చికిత్స చేయించి గాంధీ దవాఖానకు తరలించారు. మెదక్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐఏఎస్ వాణీప్రసాద్‌కు స్వల్ప గాయాలు

### విజయవాడ హైవేపై పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

కోదాడ, నవంబర్ 4 : ఏపీ కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ ప్రయాణిస్తున్న కారు జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైంది. వాణీప్రసాద్ సోమవారం హైదరాబాద్ నుంచి విజయవాడకు కారులో వెళ్తుండగా సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని డ్రైవర్ ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్వల్ప గాయలతో కారులో ఉండిపోయిన వాణీప్రసాద్‌ను స్థానికులు బయటకు తీసుకొచ్చారు. ప్రమాద స్థలానికి కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ చేరుకుని చికిత్స కోసం ఆమెను సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. ప్రమాదానికి కొద్ది దూరంలోనే వ్యవసాయ బావి ఉన్నట్టు స్థానికులు తెలిపారు. త్రుటిలో ఘోర ప్రమాదం తప్పినట్టయింది.

## అతివేగంతో ఆర్టీసీ బస్సు బోల్తా

### నలుగురికి తీవ్రగాయాలు

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 4 : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై అతివేగంతో వస్తున్న ఆర్టీసీ బస్సు పల్టీ కొట్టగా, నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డిపోకు చెందిన బస్సు సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి నల్లగొండకు బయల్దేరింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం పరిధిలోకి రాగానే అతివేగం కారణంగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న లోయలో పడిపోయింది. బస్సులో 48 మంది ఉండగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. డ్రైవర్ జంగయ్య నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

## స్కూల్ గేటుపడి చిన్నారి మృతి

### హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఘటన

హయత్‌నగర్, నవంబర్ 4: ప్రమాదవశాత్తు స్కూల్ గేటు పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్‌లోని ఎంపీపీ స్కూల్‌లో అలకంటి అజయ్(6) ఒకటో తరగతి చదువుతున్నాడు. స్కూల్ విడిచిన తర్వాత సాయంత్రం 4 గంటలకు అజయ్, తోటి మిత్రులతో కలిసి స్కూల్ గేటుతో ఆడుకుంటున్నాడు. కొంతమంది పిల్లలు గేటును అటూ ఇటు ఊపుతుండగా వెల్డింగ్ జాయింట్లు ఊడిపోయి అజయ్‌పై పడింది. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఆ తర్వాత వనస్థలిపురం ఏరియా దవాఖానలో అతడిని పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్టు నిర్ధారించారు.

# రేవంత్ మూసీ పర్యటన నగరంలో కాదు.. నల్లగొండలో!

- బాధితులు ఇక్కడ... పాదయాత్ర ఎక్కడ?
- మూసీపై ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధం
- సిటీలో ప్రజాగ్రహం తప్పదని మూసీ చివరన పల్లెల్లో యాత్రకు శ్రీకారం
- ఇండ్లు కూల్చిన చోటే యాత్ర చేపట్టాలని ప్రతిపక్షాల సవాల్

*'ప్రజలనే అడుగుతా.. మూసీ అభివృద్ధి చేయాలో వద్దో.. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు కోసం వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేస్తా..' అక్టోబర్ 29న మీడియా ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి*

*'నవంబర్ 8న యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొల్లేపల్లి, సంగం మధ్య భీమలింగం కత్వా వరకు మూసీ పునరుజ్జీవన ప్రజా చైతన్య యాత్ర చేపట్టనున్న సీఎం రేవంత్‌రెడ్డి' నవంబర్ 4న మీడియాకు విడుదలైన అధికారిక ప్రకటన*

హైదరాబాద్/యాదాద్రి భువనగిరి, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఇండ్లు కోల్పోయిన మూసీ బాధితులంతా హైదరాబాద్‌లోని మూసీ పరీవాహకం చుట్టూ ఉండగా.. వారికి దూరంగా పంట పొలాల మధ్య 'మూసీ పునరుజ్జీవన ప్రజా చైతన్య యాత్ర' పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర నాటకానికి తెరలేపడం మూసీ బాధితులు, రాజకీయ పరిశీలకులను విస్మయానికి గురిచేసింది. 11నెలల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే పాదయాత్ర పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ నడిపిస్తున్నారనేది స్పష్టమైనట్టు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్ నడిబొడ్డున పేదల ఇండ్లను కూల్చి.. మూసీ చివరన ఉన్న ప్రాంతాల్లో యాత్ర చేపట్టడం ఏంటని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. సీఎం రేవంత్ ఉద్దేశపూర్వకంగానే తక్కువ సంఖ్యలో జనం ఉండే ప్రాంతాలను ఎంచుకొని యాత్ర చేపడుతున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. ప్రజల్లోకి వెళ్తానని.. వారినే అడుగుతానన్న రేవంత్‌రెడ్డి.. దమ్ముంటే పేదల ఇండ్లు కూల్చిన ప్రాంతాల్లో పర్యటించాలని సవాల్ విసురుతున్నారు.

### పర్యటన ఇలా..

సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 8న యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం బొల్లేపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభిస్తారు. అక్కడి నుంచి సంగెం, భీమలింగం వంతెన వరకు 6 కిలోమీటర్ల మేర యాత్ర సాగనున్నది. ఈ సమయంలో మూసీ పరీవాహక ప్రాంత రైతులు, ప్రజలను రేవంత్‌రెడ్డి కలిసిల వారి సమస్యల్ని తెలుసుకోనున్నారు. సలహాలు, సూచనలు కూడా స్వీకరిస్తారు. ఈ పాదయాత్రలో జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

### ఆందోళనలులేని ప్రాంతం నుంచే..

పేదల ఇండ్లు కూల్చేసి మూసీ పునరుజ్జీవం పనులు చేపడుతున్నారు. వేల ఇండ్లకు రెడ్ మార్క్ పెట్టడంతో నగరంలోని ప్రజలు సీఎం నిర్ణయాల మీద తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఇండ్లు కోల్పోతున్న బాధితులకు అండగా నిలబడుతున్నారు. ప్రభుత్వం తరఫున ప్రజల మద్దతు కూడగట్టడానికి రేవంత్‌రెడ్డి ఇండ్లు కో ల్పోతున్న బాధితుల వద్ద నుంచే పాదయాత్ర ప్రారంభిస్తారేమోనని అందరూ భావించారు. విచిత్రంగా ఆయన ఎటువంటి ఆందోళనలు లేని ప్రాంతాల నుంచి పాదయాత్ర ప్రారంభించాలనుకోవడం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

### అసలు ఎత్తుగడ ఇదే..

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక నిర్ణయాలతో తెలంగాణలో బీఆర్ఎస్ పుంజుకుంటున్నది. కాంగ్రెస్ ప్రభావం తగ్గిపోవడంతో రేవంత్‌రెడ్డి సరికొత్త ఎత్తుగడ వేసుకున్నారు. దీనికితోడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం పాదయాత్రకు సిద్ధమైన వేళ ఆయన కంటే ముందుగా పాదయాత్ర చేయాలని రేవంత్‌రెడ్డి ఉవ్విళ్లూరుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే తన షెడ్యూల్ ప్రకటిస్తానని చెప్పిన నేపథ్యంలో రేవంత్ పాదయాత్ర మొదలుపెట్టారు. ఓ సీఎం పాదయాత్ర చేయడం అందరినీ విస్మయానికి గురి చేస్తున్నది. పాలనా వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికే పాదయాత్ర డ్రామా సాగుతున్నదని సర్వత్రా చర్చ జరుగుతున్నది.

## వాణిజ్య

### మారుతి ఉత్పత్తిలో కోత

న్యూఢిల్లీ, నవంబర్ 4: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ క్రమంగా ఉత్పత్తిని తగ్గించుకుంటున్నది. ప్రస్తుత పండుగ సీజన్‌లో కార్లకు డిమాండ్ పడిపోవడంతో గత నెలలో ప్యాసింజర్ కార్ల ఉత్పత్తిని 16 శాతం తగ్గించుకున్నట్లు వెల్లడించింది. ఇదే సమయంలో యుటిలిటీ వాహన ఉత్పత్తి మాత్రం గతేడాదితోపోలిస్తే 33 శాతం పెంచుకున్నది. ఈ విషయాన్ని సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. గత నెలలో కేవలం 89,174 యూనిట్ల ప్యాసింజర్ కార్లు ఉత్పత్తి చేయగా, 72,339 యుటిలిటీ వాహనాలను ఉత్పత్తి చేసింది. మొత్తంగా గత నెలలో 1,77,312 యూనిట్ల వాహనాలను ఉత్పత్తి చేసింది.

### ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

న్యూఢిల్లీ, నవంబర్ 4: వచ్చే ఏడాది తొలినాళ్లలో పదవీ విరమణ చేయబోతున్న రిజర్వుబ్యాంక్ డిప్యూటీ గవర్నర్ మైకేల్ దేవబ్రత పాత్రా స్థానంలో నూతన వ్యక్తిని ఎంపిక చేయడానికి కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ పదవికోసం దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు ఆర్థికవేత్త అయి వుండాలి. ఎంపికైన వ్యక్తి..పరపతి సమీక్ష డిపార్ట్‌మెంట్, పరపతి సమీక్ష కమిటీలో సభ్యుడిగా కొనసాగనున్నారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో కనీసంగా 25 ఏండ్లకు పైగా అనుభవం ఉన్న వచ్చే ఏడాది జనవరి 15 నాటికి 60 ఏండ్లకు పైబడిన వారు అర్హులు. ఎంపికైన వ్యక్తిగా నెలకు రూ.2.25 లక్షల చొప్పున వేతనం చెల్లించనున్నది. ఈ పోస్టుకు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచించింది.


రజిస్ట్రీ సं डी एल -33004/99 రిజిస్టర్డ్ నం. డి.ఎల్-33004/99

सत्यमेव जयते

# भारत का राजपत्र
## భారత రాజపత్రం

सी.जी.-डी.एल.-अ.-26102024-258275
సిజి-డిఎల్-ఇ-26102024-258275
असाधारण
విశేష పత్రం
भाग II—धारा 3—उपधारा (ii)
పార్ట్ II – సెక్షన్ 3 – సబ్ సెక్షన్ (ii)
प्राधिकरण से प्रकाशित
అధికారిక ప్రకటన

सं. 4308] नई दिल्ली, शुक्रवार, अक्तूबर 25, 2024/ कार्तिक 3, 1946
నం. 4308) న్యూ ఢిల్లీ, శుక్రవారం, అక్టోబర్ 25, 2024/కార్తీక 3, 1946

### రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ
న్యూ ఢిల్లీ, 25 అక్టోబర్, 2024

**S.O. 4684 (E)**–జాతీయ రహదారుల చట్టం 1956 (48 ఆఫ్ 1956) (ఇకమీదట సదరు చట్టంగా నిర్దేశించబడును)లోని సెక్షన్ 3A లోని సబ్ సెక్షన్ (1) క్రింద జారీ చేసిన భారత రాజ పత్రం, విశేష పత్రం, పార్ట్–II, సెక్షన్–3, సబ్ సెక్షన్ (ii)లో ప్రచురించబడిన రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం S.O. 702 (E) తేది: 14-02-2024 యొక్క ప్రకటన ద్వారా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లాలోని కి.మీ. 124.300 నుండి కి.మీ. 160.113 (మంచిర్యాల సెక్షన్) వరకు భూమి విస్తరణలో NH 63 యొక్క నిర్మాణం (వెడల్పు చేయుట/ఫోర్–లేనింగ్ మొదలగునవి), నిర్వహణ, మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కోసం సదరు ప్రకటనకు అనుబంధ షెడ్యూల్‌లో నిర్దేశిత భూమి సేకరణకు వారి ఉద్దేశం ప్రకటించినది.

సదరు నోటిఫికేషన్ ప్రధానాంశం సదరు చట్టంలోని సెక్షన్ 3A లోని సబ్–సెక్షన్ (3) క్రింద తేది: 20 ఫిబ్రవరి, 2024న ''మన తెలంగాణ'' తెలుగు దినపత్రిక మరియు ''దక్కన్ క్రోనికల్'' ఇంగ్లీష్ దినపత్రికలలో ప్రచురించబడినది.

సెక్షన్ 3–సి క్రింద దాఖలైన అభ్యంతరాలను సమర్ధ ప్రాధికారి స్వీకరించారు మరియు వాటిని తగు విధంగా పరిశీలించి, పరిష్కరించారు.

సదరు చట్టంలోని సెక్షన్ 3D లో సబ్–సెక్షన్ (1)ను అనుసరించి సమర్ధ ప్రాధికారి వారి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి దాఖలు చేశారు.

అందువలన, ఇప్పుడు సమర్ధ ప్రాధికారి యొక్క సదరు నివేదిక అందిన తరువాత సదరు చట్టంలోని సెక్షన్ 3D లోని సబ్ సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలు వినియోగించు కుంటూ పైన తెలిపిన ఉద్దేశ్యం కొరకు సదరు షెడ్యూల్‌లో తెలిపిన భూమిని సేకరించాలని కేంద్ర ప్రభుత్వం ఇందుమూలముగా ప్రకటిస్తుంది.

సదరు ప్రకటన సదరు చట్టంలోని సెక్షన్ 3D క్రింద అవసరమైన విధంగా భారత రాజపత్రం, విశేషపత్రం, పార్ట్ II, నెం.4308 న్యూ ఢిల్లీ, శుక్రవారం, అక్టోబర్ 25, 2024లో ప్రచురించబడింది.

తదుపరిగా, సదరు చట్టంలోని సెక్షన్ 3D లోని సబ్–సెక్షన్ (2)ను అనుసరించి అధికారిక రాజ పత్రంలో ఈ నోటిఫికేషన్ ప్రచురణపై సదరు షెడ్యూల్‌లో పేర్కొనబడిన సదరు భూమి తాకట్టు రుణ భారాలు ఏవీ లేకుండా ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వానికి సంక్రమించి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ఇందుమూలముగా ప్రకటన ఇస్తోంది.

అందువలన, ఇప్పుడు సెక్షన్ 3Gలోని సబ్–సెక్షన్ (3)ను పాటిస్తూ సమర్ధ ప్రాధికారి అనగా భూ సేకరణ కొరకు రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ కమ్ సమర్ధ ప్రాధికారి, మంచిర్యాల జిల్లా వారి కార్యాలయములో ఈ బహిరంగ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 19.11.2024న సా. 5.00 గం. నాటికి 15 రోజుల కాల వ్యవధిలోగా దిగువ ఇందులో ఇవ్వబడిన షెడ్యూల్‌లో తెలిపిన భూమికి సంబంధించి ఈ ప్రోసీడింగ్స్ క్రింద సేకరించబడే భూమి యజమానులు లేదా భూమిలో ప్రయోజనం గల వ్యక్తులందరిని వారి క్లెయిమ్‌లను దాఖలు చేయుటకు సమర్ధ ప్రాధికారి ఇందుమూలముగా ఆహ్వానిస్తున్నారు.

సదరు భూమిలో ప్రయోజనం గల వ్యక్తులందరూ సదరు భూములలో వారి సంబంధిత ప్రయోజన స్వభావాన్ని తెలియజేస్తూ దిగువ పట్టికలో తెలిపిన తేదీన భూ సేకరణ కొరకు రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ కమ్ సమర్ధ ప్రాధికారి (CALA) NHAI, మంచిర్యాల జిల్లా, మంచిర్యాల (NH 63) సమక్షంలో వారి భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు మరియు జిరాక్స్ కాపీలతో స్వయంగా లేదా ఏజెంట్ లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా హాజరు కావలసిందిగా సూచించబడుచున్నారు.

| క్ర. సం. | మండలం పేరు | గ్రామం పేరు | విచారణ తేది మరియు సమయం | విచారణ ప్రదేశం |
|---|---|---|---|---|
| 1 | మందమర్రి | తిమ్మాపూర్ | 22-11-2024న ఉ.11.00 గంటలు | ఆర్‌డిఒ కార్యాలయం మంచిర్యాల |

దిగువ ఇవ్వబడిన షెడ్యూల్‌లో పేర్కొన్న భూములలో ప్రయోజనం గల వ్యక్తులందరూ (భూముల యజమానులు మరియు ప్రయోజనం గల ఇతర వ్యక్తులు) సదరు భూమిలో (వారి వాటా, భూమి ఏరియా, దానికి అనుసంధానం చేసిన ఇతర ఆస్తులు ఉదా: కట్టడాలు/చెట్లు మొదలైనవి) మరియు సంబంధిత రికార్డులతో సహా సదరు భూములలో సంబంధిత ప్రయోజన స్వభావాన్ని తెలియజేస్తూ వారి క్లెయిమ్‌లను దాఖలు చేయాల్సిందిగా ఇందుమూలముగా సూచించబడుచున్నారు. సదరు భూమి యజమానులు లేదా ప్రయోజనం గల వ్యక్తులు వారి పరిహారం మొత్తం జమ చేసేందుకు వారి బ్యాంక్ ఖాతాల వివరాలను తెలియజేయవలెను. సదరు క్లెమ్ లను దిగువ సూచనాత్మక ఫార్మేట్‌లో దాఖలు చేయవలెను.

| గ్రామం / పట్టణం పేరు | భూ యజమానులు /ప్రయోజనం గల వ్యక్తి పేరు | ఫీల్డ్ సర్వే నం. | అతని వాటాలో భూమి విస్తీర్ణం | భూమిపై ఉన్న ఏవైనా కట్టడాలు/ చెట్లు/గొట్టపు బావి | పాన్ నం. | అతను/ఆమె నిర్వహిస్తున్న ఖాతా ఉన్న బ్యాంక్ మరియు శాఖ పేరు | బ్యాంక్ ఖాతా నెం., బ్యాంక్ శాఖ యొక్క IFSC కోడ్ వివరాలు |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | |

షెడ్యూల్

తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లాలో కి.మీ. 124.300 నుండి కి.మీ. 160.113 (ఆర్మూర్– జగిత్యాల–మంచిర్యాల సెక్షన్) భూమి విస్తరణలో NH 63 పరిధిలోకి వచ్చే కట్టడాలతో లేదా కట్టడాలు లేకుండా సేకరించే భూమి సంక్షిప్త వివరణ.

ఇంగ్లీష్ మరియు హిందీలో నోటిఫికేషన్ కొరకు స్కాన్ చేయండి | తెలుగులో నోటిఫికేషన్ కొరకు స్కాన్ చేయండి

[F. No. NHAI/PIU/MNCL/AJM/2024/3a-01/3D]
అభయ్ జైన్, డైరెక్టర్

జిల్లా: మంచిర్యాల
ప్రచురణ తేది: 25-10-2024
https://egazette.gov.in/
https://morth.gov.in/
https://bhoomirashi.gov.in/auth/revamp/showFileDf.cshtml?notification_id=56729&file_id=28372

సం/-
రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్
మరియు సమర్ధ ప్రాధికారి భూ సేకరణ కొరకు (CALA) NHAI, మంచిర్యాల (NH 63)


# దిగొచ్చిన బంగారం

**ఒక్కరోజే రూ.1,300 తగ్గుముఖం • తులం రూ.81,100 వద్దకు..**

**కిలో వెండి రేటు రూ.4,600 పతనం • మార్కెట్‌లో భారీగా క్షీణించిన డిమాండ్**

న్యూఢిల్లీ, నవంబర్ 4: రోజురోజుకూ పెరుగుతూ.. రికార్డులతో కదంతొక్కిన బంగారం, వెండి ధరలు ఎట్టకేలకు దిగొచ్చాయి. సోమవారం దేశీయ మార్కెట్‌లో భారీగా పడిపోయాయి. ఈ ఒక్కరోజే 10 గ్రాముల 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పుత్తడి రేటు ఏకంగా రూ.1,300 తగ్గింది. దీంతో ఢిల్లీలో రూ.81,100 వద్ద స్థిరపడింది. గత గురువారం మునుపెన్నడూ లేనివిధంగా తులం పసిడి ధర ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.82,400 పలికిన విషయం తెలిసిందే. ఇక వెండి ధరలూ పెద్ద ఎత్తునే తగ్గుముఖం పట్టాయి. కిలో రూ.4,600 క్షీణించి రూ.95 వేల మార్కుకు దిగువన రూ.94,900 వద్ద నిలిచింది. కాగా, హైదరాబాద్ ధరల విషయానికొస్తే.. 24 క్యారెట్ తులం బంగారం రూ.80,400గా, 22 క్యారెట్ రూ.73,700గా ఉన్నాయి.

### తగ్గిన డిమాండ్

స్టాక్‌హోల్డర్లు, రిటైలర్లు బంగారాన్ని ఒక్కసారిగా అమ్మడానికి ముందుకు రావడం, పెట్టుబడులను వెనక్కి తీసుకోవడంతో మార్కెట్‌లో ధరలు భారీగా పతనమైపోయాయని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. పండుగలు అయిపోవడంతో స్థానిక మార్కెట్లలో జ్యుయెల్లర్స్ నుంచి డిమాండ్ కూడా లేదని పేర్కొన్నది. దసరా, ధనత్రయోదశి, దీపావళి దృష్ట్యా నగల వర్తకుల నుంచి పసిడికి విశేష ఆదరణ లభించింది. కాగా, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)పై ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో డిసెంబర్ నెల డెలివరీకిగాను గోల్డ్ కాంట్రాక్ట్స్ 10 గ్రాములు రూ.78,538 వద్ద ట్రేడ్ అయ్యాయి. గతంతో పోల్చితే రూ.329 పడిపోయింది. గత వారం ఫ్యూచర్స్ మార్కెట్‌లో ధర తొలిసారి రూ.79,775 పలికింది. సిల్వర్ కాంట్రాక్ట్స్ కిలో రూ.95,071గా ఉన్నది. మునుపటితో చూస్తే రేటు రూ.412 పడిపోయింది.

### అంతర్జాతీయ మార్కెట్‌లో..

భారతీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు దిగొస్తున్నా.. అంతర్జాతీయ మార్కెట్‌లో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఔన్సు పుత్తడి 3.60 డాలర్లు ఎగిసి 2,752.80 డాలర్లుగా నమోదైంది. ఔన్సు వెండి కూడా 32.94 డాలర్లు పుంజుకున్నది. వచ్చే ఏడాది ఆఖరుకల్లా ఔన్సు గోల్డ్ విలువ 3,000 డాలర్లపైకి చేరుతుందన్న అంచనాలున్నాయి.

### ఒడిదొడుకుల్లోనే..

బంగారం ధరలు రాబోయే రోజుల్లో తీవ్ర ఒడిదొడుకులకు లోనయ్యే వీలుందని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలిత